క్లుప్తంగా

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

సాక్షి నెట్‌వర్క్: అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతుండటంతో అన్ని పార్టీల నాయకులు ప్రచారం ముమ్మరం చేశారు. జిల్లా కేంద్రంలోని జవహర్‌నగర్‌కాలనీలో ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి ప్రచారం చేపట్టారు. మొగుళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర వెంకటరమణారెడ్డి ప్రచారం నిర్వహించారు. అలాగే చిట్యాల మండలంలోని కైలాపూర్‌లో జెడ్పీటీసీ గొర్రె సాగర్ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ప్రచారం చేశారు. అదేవిధంగా కాటారం మండలంలోని బోప్పారం గ్రామంలో బీజేపీ మంథని ఎమ్మెల్యే అభ్యర్థి చంద్రుపట్ల సునీల్‌రెడ్డి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు పార్టీలో చేరగా ఆహ్వానించారు.

ఆర్థిక సాయం



కన్నాయిగూడెం: మండలంలోని ముప్పనపల్లి గ్రామానికి చెందిన తిప్పనపల్లి దుర్గయ్యకు ఇటీవల పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమయ్యాడు. దీంతో నిరుపేద కుటుంబానికి చెందిన అతడికి ముప్పనపల్లి సహాయ నిధి గ్రూపు సభ్యుడు అబ్బు సతీష్ స్పందించి గ్రూపు సభ్యుల సహకారంతో బుధవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. పల్లా శ్రీనువాస్, నామని రాజేష్‌తో పాటు తదితరలు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

టేకుమట్ల: ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాప్‌పై బుధవారం దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా వివరాలను వెల్లడించారు. మండలంలోని గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన సొతుకు తిరుపతి అనే వ్యక్తి తన కిరాణంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తుండగా సోదాలు చేసి రూ.3వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనపర్చుకుని, అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏఎస్ఐ అమరేందర్‌రెడ్డి, కానిస్టేబుల్ మహేందర్ తదితరులు ఉన్నారు.

ఒకరి రిమాండ్

శాయంపేట : ప్రకృతిలో ఆహ్లాదంగా తిరిగే నీటి కాకిని చంపిన ఘటనలో వ్యక్తిని రిమాండ్‌కు పంపించినట్లు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ మైసయ్య తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బంక కిరణ్ అక్టోబర్ 24వ తేదీన నీటి కాకిని వేటాడి చంపి వండుకొని తిన్నాడని సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వచ్చిందన్నారు. డీఎఫ్ఓ ఆదేశాల మేరకు అతని ఇంట్లో సోదాలు చేయగా అతని సెల్ ఫోన్‌లో ఫోటోలు, నీటి కాకిని చంపిన కత్తి, పరికరాలు లభించగా వాటిని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



భాస్కర్ (ఫైల్)

చిట్యాల: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ వద్ద ఆగి ఉన్న బియ్యం లారీని ద్విచక్ర వాహనం ఢీకొని తండ్రి మృతి చెందగా.. కూతురికి తీవ్ర గాయాల పాలైన సంఘటన బుధవారం రాత్రి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. రేగొండ మండలం రంగయ్యపల్లి గ్రామానికి చెందిన వంగ భాస్కర్ (35) అత్తగారి ఇంటికి వచ్చాడు. ఈ క్రమంలో తన కూతురును తీసుకుని సాయంత్రం రంగయ్యపల్లికి వెళ్తున్న క్రమంలో మోడల్ స్కూల్ వద్ద ఉన్న గోదాం వద్ద ఆగి ఉన్న బియ్యం లారీని వెనుక నుండి ఢీకొట్టాడు. దింతో అతనికి తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. అతడితో ఉన్న కూమార్తెకు తలకు గాయం కావడంతో స్థానిక సివిల్ ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. మృతిడికి భార్య, ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ఇద్దరికి గాయాలు

శాయంపేట : వాకింగ్‌కు వెళ్లివస్తూ రోడ్డు దాటుతున్న వ్యక్తిని ద్విచక్ర వాహనం ఢీకొట్టిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన కందగట్ల కుమారస్వామి బుధవారం తెల్లవారుజామున వాకింగ్‌కు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన బాసాని రామకృష్ణ(హరీష్) పొలం పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్తూ అతన్ని ఢీ కొట్టాడు. ఈ సంఘటనలో కుమారస్వామికి ఎడుమ కాలు విరుగగా రామకృష్ణకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి సమాచారం అందించారు. అంబులెన్స్ ఆత్మకూరు నుంచి ఆలస్యంగా రావడంతో క్షతగాత్రులు గాయాలతో రోడ్డుపైనే ఉన్నారు. సంఘటన స్థలానికి అంబులెన్స్ చేరుకోగానే క్షతగాత్రులను ఎంజీఎంకు తరలించారు.

నామినేషన్ల జోరు..

భూపాలపల్లి: భూపాలపల్లి అసెంబ్లీ స్థానానికి బుధవారం వివిధ పార్టీల నాయకులు, స్వతంత్రులు నామినేషన్లు దాఖలు చేశారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న అల్లం మహేష్



వంగర సాంబయ్య



తాళ్ళపల్లి రమేష్



మారెపల్లి మల్లయ్య



గజ్జి జితేందర్



పొన్నం బుచ్చయ్య



సిరిపెల్లి రాజయ్య

ఎన్నికల నిబంధనలు పాటించాలి



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రాములు

చిట్యాల: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని డీఎస్పీ రాములు అన్నారు. మండలంలోని అందుకుతండాలో ఎస్సై జంగిళి రమేష్ ఆధ్వర్యంలో బుధవారం డీఎస్పీ రాములు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పత్రాలు సరిగా లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామాల్లో గుడుంబాను పూర్తిగా నిర్మూలించాలని సూచించారు. ఎవరైనా గుడుంబాను తయారు చేసిన, విక్రయించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉంది కావున గ్రామాల్లో మద్యాన్ని విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ దాసారపు వేణుచందర్, చిట్యాల సర్కిల్ పరిధిలోని ఎస్సైలు శ్రీకాంత్‌రెడ్డి, మాదవ్, శ్రీధర్, సాంబమూర్తి, సుదాకర్, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రెబల్ అభ్యర్థి నామినేషన్



నామినేషన్ వేస్తున్న బీఆర్‌ఎస్ రెబల్ అభ్యర్థి పోరిక పోమా నాయక్

ములుగు రూరల్: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా ములుగు మండలం మదనపల్లి గ్రామానికి చెందిన పోరిక పోమా నాయక్ నామినేషన్ వేశారు. ఈ మేరకు బుధవారం పార్టీ అసమ్మతి వాదులను కలుపుకొని జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కంగుతిన్నారు. రెబల్ అభ్యర్థి బరిలో ఉంటే బీఆర్‌ఎస్ పార్టీకి నష్టం వాటిల్లే పరిస్థితి ఉంది. ములుగు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్‌ల ప్రవర్తన నచ్చక నామినేషన్ వేసినట్లు పోమా నాయక్ తెలిపారు. అలాగే తాడ్వాయి మండలం పడిగాపూర్ గ్రామానికి చెందిన మనోహర్ మల్యాల స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు.

'అవినీతి బీఆర్‌ఎస్‌ను సాగనంపాలి'

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు పి.మురళీధర్‌రావు



మాట్లాడుతున్న మురళీధర్‌రావు

కాళేశ్వరం : కాళేశ్వరం పేరుతో అవినీతికి పాల్పడిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో ప్రజలు సాగనంపాలని, ప్రజల మేలు కోరే ప్రభుత్వాన్ని గెలిపించుకోవాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, గోదావరి హారతి వ్యవస్థాపక చైర్మన్ పి.మురళీధర్‌రావు ఆరోపించారు. బుధవారం ఆయన జయశంకర్‌భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని కాళేశ్వరముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. గోదావరి హారతి కార్యక్రమంలో భాగంగా మంథని, ములుగు జిల్లాలో పర్యటించారు. గోదావరితోనే ఆర్థిక, సాంస్కృతిక, సాహిత్య పరమైన అభ్యున్నతి, అభివృద్ధి గోదావరితో కూడి ఉన్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవకతవకలు చేసి నాసిరకంగా పనులు చేపట్టడంతో మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీ కుంగిపోయిందన్నారు. కేంద్ర డ్యాం సేఫ్టీ అథారిటీ బృందం బ్యారేజీ పనికి రాదని, ఉపయోగపడదని తేల్చి చెప్పారని గుర్తుచేశారు. అవినీతి ప్రభుత్వంపై కేంద్రం దర్యాప్తు చేయాలంటే బీఆర్‌ఎస్‌ను సాగనంపి బీజేపీకి మద్దతు తెలపాలని ఆయన కోరారు. ఆయన వెంట రాష్ట్ర కన్వీనర్ లింగంపల్లి వీరగోపాల్, కో కన్వీనర్ క్యాతం వెంకటరమణ, బల్లురు సంతోష్‌రావు, బీజేపీ నాయకులు గోర శ్రీకాంత్, చరణ్‌దాస్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రామారావు

మల్హర్: మండలంలోని తాడిచర్ల పీఏసీఎస్(సహకార సంఘం) చైర్మన్‌గా చెప్యాల రామరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సీఈఓ సంతోష్ సొసైటీ కార్యాలయంలో రామరావుకు చైర్మన్‌గా బాధ్యతలను అప్పగించారు. గతంలో సొసైటీలో ధాన్యం కొనుగోళ్లు, ఎరువుల విషయంలో వచ్చిన పలు ఆరోపణలో నేపథ్యంలో రామరావును చైర్మన్, డైరెక్టర్‌గా పదవీ బాధ్యతలను జిల్లా ఉన్నతాధికారులు తొలగించిన విషయం తెలిసిందే. కాగా హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్‌తో రామరావుకు సొసైటీ చైర్మన్‌గా అధికారులు తిరిగి బాధ్యతలను అప్పగించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి భవ్యశ్రీ

వెంకటాపురం(కె): వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటామని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ అన్నారు. మండల పరిధిలోని తిప్పాపురం గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం వైద్య సిబ్బంది ఇంటింటి ఫీవర్ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఎవరైన జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారా అనే విషయాలను సర్వే చేశారు. అనంతరం తిప్పాపురం పాఠశాలలో విద్యార్థులకు హ్యాండ్‌వాష్ చేసుకోవటం వల్ల కలిగే ప్రయోజనాలపై వివరించారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లో గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు.

బీఆర్‌ఎస్, బీజేపీలను ఓడించాలి



మాట్లాడుతున్న నాయకులు

కాటారం: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలని తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు పీక కిరణ్, కర్ణాటక సమ్మయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేశంలో మతతత్వం, రాష్ట్రంలో నియంతృత్వం రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రజా ఆకాంక్షలకు వ్యతిరేకంగా తన పాలన కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రజల హక్కులను కాలరాస్తూ ప్రశ్నించే గొంతులను అణిచి వేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ కూలడానికి బాధ్యత వహిస్తూ కేసీఆర్ రాజకీయాల నుంచి వైదొలగాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఉద్యమకారుల ఐక్య వేదిక, ప్రజా సంఘాల నాయకులు కామెర గట్టయ్య, రత్నం కిరణ్, చల్లగురుగల సంజీవ్, అక్కల బాపు, వావిలాల లక్ష్మణ్, శ్రీధర్, యుగేందర్, గట్టయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్



ట్రాఫిక్ జామ్‌తో నిలిచిన వాహనాలు

టేకుమట్ల: మండల కేంద్రంలో ప్రతీ వారం నిర్వహించే వారసంత రోజు మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు నిత్యావసర సరుకుల కోసం మండల కేంద్రానికి వస్తుంటారు. దీంతో బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో జనాలతో రద్దీగా ఉన్న సమయంలో ఇసుక లారీలు, కార్లు, ట్రాలీలు ఒక్కసారిగా చౌరస్తాకు చేరుకోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సుమారు 20నిమిషాల పాటు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో జనాలు ఇబ్బంది పడ్డారు. వాహనాలు వెళ్లిపోవడంతో తిరిగి సంతలో జనాలు తిరిగారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు అందజేస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

కాటారం: పేద విద్యార్థులకు రవాణా ఇబ్బందులు తొలిగించడం కోసం తానా (తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా) ఫౌండేషన్ వారు సాకారం అందజేశారు. మండలంలోని ధన్వాడ జెడ్పీహెచ్ పాఠశాలలో చదువుతున్న 12 మంది పేద విద్యార్థులకు బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు కిషన్ నాయక్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. దూర ప్రాంతం నుంచి వచ్చే విద్యార్థులకు రవాణా భారం అవుతుందని మేయిల్ ద్వారా తానా ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీంతో స్పందించిన తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్, దాతలు కోళ్ల అశోక్, కుసుమర్తి రాజా, సామనేని విద్యార్థులకు 12 సైకిళ్లు అందజేసినట్లు పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రుల తరుపున తానా ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంట రాజబాబు, శ్రీనివాస్, తిరుపతి, పర్వీన్, విద్యా కమిటీ చైర్మన్ రమేశ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి



మాట్లాడుతున్న ఏసీపీ కిశోర్‌కుమార్

శాయంపేట : ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రజలు సహకరించాలని ఏసీపీ కిశోర్‌కుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పత్తిపాక గ్రామంలో బుధవారం గ్రామస్తులతో మాట్లాడారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్‌శాఖ ముందస్తు చర్యలు చేపట్టిందన్నారు. రాజకీయ కక్షలకు తావివ్వకుండా శాంతియుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఎలాంటి సమస్య వచ్చినా పోలీస్‌లకు సమాచారం ఇవ్వాలని, వ్యక్తిగత దూషణలు, గొడవలకు దిగితే కేసుల నమోదు చేస్తామని అన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ మల్లేష్, ఎస్సై దేవేందర్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

చిట్యాల: మండలంలోని జడల్‌పేట గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ కాత్రేవుల సాయిలు బుధవారం బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 సంవత్సరాల రాజకీయ పయనంలో ఎక్కువ కాలం కాంగ్రెస్ పార్టీలో పని చేశానని, కాంగ్రెస్ పార్టీ తనకు తల్లిలాంటిదని అన్నారు.

సమాజంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

పరకాల: విద్యార్థి దశ నుంచే సమాజంలో ఉండే సమస్యలపై ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ అన్నారు. ముందు వరుసలో ఉండటం వలన సమస్యల పరిష్కారానికి కృషిచేయవచ్చన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థుల కోసం చేపట్టే తొలిమెట్టు కార్యక్రమం ఒక బృహత్తర కార్యక్రమం అన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల్లో, సొంత గ్రామాల్లో సేవచేసే అవకాశం తొలిమెట్టు ద్వారా రావడం చాలా అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి జి.ఓదేలు, అధ్యాపకులు డాక్టర్ ఎం.అరుణ, డాక్టర్ ఎల్.ఇందిరాదేవి, ఆర్.కుమారస్వామి, డాక్టర్ వి.రాజయ్య, అశోక్ మోరె, ఎం.రవికుమార్, ఎ.అనిల్‌కుమార్, సి.హెచ్ సుస్మిత, రాజశ్రీ, సంజయ్‌కుమార్, డాక్టర్ స్వప్న, శ్రీనివాస్, రఫీ, రాజు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

శాయంపేట : విద్యార్థులు, యువకులు, వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై దేవేందర్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సైబర్ క్రైమ్ పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కల్గి ఉండాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, డయల్ 100, బాల్య వివాహాలు, సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనంతో పాటు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామీణ ప్రాంతంలోని యువకులు, ప్రజలు గుట్కా, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో సమస్యలు తలెత్తితే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు రావాలని, ప్రజలకు పోలీస్‌లకు మధ్య స్నేహపూర్వకమైన సంబంధం ఉందన్నారు. ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాజీనామా

పరకాల: సీపీఐ నాయకులు మూకుమ్మడి రాజీనామలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లా నాయకుల విధానాలు, అతివాద పోకడలు నచ్చకపోవడంతో రాజీనామా చేస్తున్నట్లు సీపీఐ పరకాల పట్టణ కార్యదర్శి బొట్ల ప్రభాకర్ తెలిపారు. ఆయనతో పాటు భవన నిర్మాణ కార్మిక సంఘం(బీఓసీ) మండల అధ్యక్షుడు అడపకుమార్, సీపీఐ, బీఓసీ మండలాల బాధ్యులు, కార్మికులు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

14 నుంచి కార్తీక మాసోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దేవస్థాన చైర్మన్, అర్చకులు

పరకాల: శ్రీకుంకుమేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకు కార్తీక మాసోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం చైర్మన్ గందె వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆలయ ప్రాంగణంలో కార్తీక మాసోత్సవాలకు సబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్తీక మాసం నెలరోజుల పాటు భక్తుల సహకారంతో ఉదయం అన్నదానం, సాయంత్రం అల్పాహారం అందించనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మ, ఈఓ వెంకటయ్యతో పాటు ఆలయ ధర్మకర్తలు పాల్గొన్నారు.



ఆహ్లాదపరుస్తున్న గడ్డిపూలు

మండలంలోని వజినేపల్లి నుంచి మహాముత్తారం వేళ్లే ప్రధాన రహదారిలోని వాగు గడ్డిపూలతో నిండుకుంది. దీంతో వాహనదారులు చూపరులను ఆకట్టుకుంటుంది. ఆ రహదారి వెంబడి వెళ్తున్న వాహనదారులు గడ్డిపూలను చూస్తూ మురిసిపోయి ఆగి ఫొటోలు దిగి వెళ్తున్నారు.

– మహాముత్తారం

మట్టిపోశారు.. మేటలు వేశారు

- చలివాగుకు మళ్లీ గండి!

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారు మధ్యతరహా చలివాగు ప్రాజెక్టు ప్రధాన కట్టకు మళ్లీ గండి పడింది. ఇటీవల చేపట్టిన గండి పూడ్చివేత పనుల్లో నాణ్యతలోపం కళ్లకుకొట్టొచ్చినట్లు కనిపిస్తుందని రైతులు మండిపడుతున్నారు. ఆయకట్టు రైతులకు సాగునీరు అందకుండా అధికారులు సాగునీటి సరఫరాను నిలిపివేశారు. ప్రాజెక్టు ప్రధాన కాల్వకు అక్టోబరు 29వ తేదీన గండిపడడంతో ఈనెల 1న దేవాదుల అధికారులు గండిని మట్టితో పూడ్చివేసి ఇసుక బస్తాలతో మేటలు వేసి చేతులు దులుపుకున్నారు. కిందిస్థాయి ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయగా మంగళవారం మధ్యాహ్నం అదేప్రదేశంలో మళ్లీ గండిపడి నీరు చలివాగులోకి మళ్లింది. విషయం తెలుసుకున్న అధికారులు సాగునీటి సరఫరాను నిలిపివేశారు. ఆయకట్టు కింద వరి పంటలు సాగు చేసిన రైతులు నీటి కోసం ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గండిని పూడ్చాలని కోరారు.